సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



ఆంధ్ర-రైల్వేస్ మ్యాచ్ డ్రా

కడప వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో రైల్వేస్, ఆంధ్ర జట్ల మధ్య జరుగుతున్న అండర్-23 క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

-8లో



ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(ఆర్ట్స్ కళాశాల)లో 2వ గ్రాడ్యుయేషన్ డే వేడుక బుధవారం వైభవంగా జరిగింది.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.172
రెండోరకం	రూ.80	రూ.118



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 129 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	465	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 329.040 కిలోలు

న్యూస్‌రీల్

23న దివ్యాంగుల ఉద్యోగమేళా

రాయచోటి టౌన్: దివ్యాంగుల ఉద్యోగుల మేళాను సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్యజిల్లా ఉపాధికల్పనాధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు పీలేరులోని ప్రభుత్వ ఐటీఐలో ఈ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో యాక్ట్ ఫైబర్ కస్టమర్ సంపోర్ట్ ఎగ్జిక్యూటివ్, కంపాస్ గ్రూప్ కంపెనీలో స్టీవార్డ్స్ ఉద్యోగాలు, మాక్స్ రిటైల్ కంపెనీలో పోల్డింగ్ అసిస్టెంట్స్, మెక్ డొనాల్డ్ కంపెనీలో క్రైవ్ మెంబర్ స్టోర్ ఉద్యోగాల కోసం, బీపీసీఎల్ కంపెనీలో డీఎస్ఎం/ డీఎస్‌డబ్ల్యూ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఎంపికైన అభ్యర్థులకు వేతనం రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలు, ఫొటోలతో మహిళలు / పురుష అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు.

అత్యుత్తమ ప్రమాణాలతో భవనాల నిర్మాణం



తరగతి గదుల్లో ఎల్ఈడీ టీవీలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

ఓబులవారిపల్లె: తల్లెంవారిపల్లె జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల నూతన భవనాలు అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మాణం చేశారని ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి అన్నారు. బుధవారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ తక్కువ సమయంలో నాణ్యతతో కూడిన పనులు చేయడం హర్షణీయమని అన్నారు.త్వరలోనే వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీల ద్వారా బైజూస్ క్లాస్‌లను పరిశీలించారు. హెచ్ఎం షాయిదుల్లాతో మాట్లాడారు. పాఠశాల గురించి విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గడ్డం ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రవికుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యతో జీవన ప్రమాణాలు మెరుగు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి టౌన్: వ్యాయామ విద్యతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని డీఈవో శివప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలోని బాలికోన్నత పాఠశాలలో రాయచోటి నియోజకవర్గ పరిధిలోని వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాయామంతో మానసిక, శారీరక ధారుఢ్యం లభిస్తుందని చెప్పారు. క్రమం తప్పకుండా పీడీలు, పీఈటీలు డ్రస్ కోడ్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీల నియోజకవర్గ బాధ్యులు జగదీశ్వరయ్య, ఏపీ పీఈటీ, ఎస్ఏ పీఈ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య, పీడీలు లలితమ్మ, లక్ష్మీనారాయణ, వెంకటరాజు, నిర్మలమ్మ, పద్మజ, అమరనాథరెడ్డి, వరద రాజు, చక్రపాణి, గంగరాజు, ఫయాజ్, కొండలరావు, అంజి, వాణి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ



రజత పతకంతో లీసాకంసా

వైవీయూ: అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో నిర్వహిస్తున్న ఖేలోఇండియా విశ్వవిద్యాలయ క్రీడాపోటీల్లో వైవీయూ క్రీడాకారిణి లీసా కంసా సత్తా చాటింది. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశంలో 59 కేజీల మహిళల విభాగంలో పోటీపడిన ఈమె స్నాచ్ విభాగంలో 77 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 104 కేజీల బరువెత్తి రెండోస్థానంలో నిలిచింది. రజత పతకం కైవసం చేసుకుంది. కమలాపురానికి చెందిన సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలకు చెందిన లీసా కంసా ఈ విద్యాసంవత్సరంలో జాతీయస్థాయిలో 5 పతకాలు సాధించడం విశేషం. క్రీడాకారిణికి వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందనలు తెలిపారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం



- రంగంలోకి దిగిన రాపిడ్ రెస్పాన్స్‌టీంలు
- వలసపక్షులు, కోళ్ల రక్త నమునాల సేకరణ
- నెల్లూరు నుంచి కోళ్ల రవాణాపై ప్రత్యేక దృష్టి



కోళ్లఫారాలను తనిఖీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

రాజంపేట: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ భయం వెంటాడుతోంది.దీనిపై ఉభయ జిల్లాల పశుసంవర్ధకశాఖలు అప్రమత్తమయ్యాయి. రాపిడ్ రెస్పాన్స్ టీంలు రంగంలోకి దిగాయి. వలసపక్షుల, కోళ్ల రక్త నమునాల సేకరణ చేపట్టారు. ఉభయ జిల్లాల్లో 50లక్షలకు పైగా ఫారంకోళ్లు ఉన్నాయి. మరోవైపు కోళ్ల రైతులు, కోళ్ల మాంసం విక్రయదారులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ అవగాహన కల్పిస్తోంది. నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ బయటపడటంతో అక్కడి నుంచి కోళ్ల రవాణా జరగకుండా అడ్డుకుంటున్నారు. సరిహద్దుల్లో తనిఖీలు చేపట్టారు. కోళ్ల రవాణా,ఇతర వలస పక్షులు ఉంటే స్వాధీనం చేసుకుని రక్తనమునాలు సేకరిస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో కోళ్ల సంఖ్య: 2893221
వైఎస్సార్ జిల్లాలో: 1095152

బర్డ్‌ఫ్లూ అంటే..

కోళ్లకు వచ్చే జలుబు జ్వరాన్ని బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా)అంటారు. వైరస్ వల్ల వస్తుంది. ఇది అంటువ్యాధి. ఇది కోళ్ల నుంచి మనుషులకు వస్తుంది. కోడి మాంసం, గుడ్లు తినాలనుకుంటే బాగా ఉడికించి మాత్రమే తినాలి. మొదటిసారిగా 1997లో హాంకాంగ్‌లో కోళ్ల ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాధి మనుషులకు వ్యాపించింది. అక్కడ 18లక్షల కోళ్లను చంపివేశారు.

వ్యాధి లక్షణాలు..

కోళ్లలో దగ్గు జలుబు ఆయాసం తుమ్ములు ఉంటాయి. కళ్ల నుంచి నీరు కారుతుంది. ముఖం వాచి ఎరుపు రంగు నుంచి క్రమేపి నీలి రంగులో మారుతుంది. ఈకలు నిక్కపొడుచుకొని ఉంటాయి. కొళ్లు పలుచగా రెట్టలు వేస్తాయి. ఈ వ్యాధికి చికిత్స లేదు. ఈ వ్యాధి సోకిన మనుషులు జ్వరం, దగ్గు తలనొప్పి, జలుబు, గొంతులో పుండ్లు వస్తాయి. ఉపిరాడక, మరణాలు సంభవిస్తాయి.

వ్యాధి నిరోధక చర్యలు..

కోళ్ల రవాణాను నిషేధించాలి. చనిపోయిన వాటిని కాల్చివేయాలి.కోళ్ల షెడ్లు, ఆవాసాలు, దాణా నీటి పాత్రలు మొదలైన వాటిని క్రిమిసంహారక మందులతో పిచికారీ చేయాలి.

ప్రజలు ఏమి చేయాలంటే..

మూడు నెలలపాటు కోళ్ల అమ్మరాదు, కొనరాదు. వీటి రవాణను అడ్డుకోవాలి. బహుమతిగా కోళ్లను ఇవ్వరాదు, తీసుకోరాదు. కోళ్లు ఎక్కువుగా చనిపోతుంటే పశువైద్యులకు సమాచారం ఇవ్వాలి. కోళ్ల ఫారాలు ఉన్న వారు వేరే కోళ్లను లోపలికి తీసుకొని రాకూడదు. కోళ్ల ఫారాల్లోకి వేరే మనుషులను కూడా రానివ్వకూడదు. ఈ విధంగా ప్రజలకు అవగాహనను పశుసంవర్ధకశాఖ కల్పిస్తోంది.

భారీగా పడిపోతున్న కోళ్లమాంసం ధరలు..

కోళ్ల మాంసం ధరలు భారీగా పడిపోతున్నాయి. ప్రజల్లోకి బర్డ్‌ఫ్లూ భయం వెంటాడుతున్న క్రమంలో చికెన్ జోలికి వెళ్లకుండా ఉన్నారు. చికెన్ కొనుగోలు చేయడానికి సంకోచిస్తున్నారు.. దీంతో చాలా ప్రాంతాల్లో చికెన్ దుకాణాదారులు ఆందోళన చెందుతున్నారు.

- బర్డ్‌ఫ్లూ ఉభయ జిల్లాల్లోకి ప్రవేశించకుండా పకడ్బందీగా పశుసంవర్ధకశాఖ చర్యలు తీసుకుంటోందని ఆయా జిల్లాల పశు వ్యాధుల నిర్ధారణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టరు రాజశేఖర్ అన్నారు. ఇప్పటికి వరకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదు. ముందస్తు చర్యలు తీసుకోవాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేస్తున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా సరిహద్దులో కోళ్ల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాసరిహద్దు ప్రాంతమైన అనుంపల్లె, ములకలచెరువు, కర్ణాటక సరిహద్దు వద్ద కోళ్ల రవాణా నిషేధం అమలుచేస్తున్నాము. కోళ్ల ఫారాలను కూడా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం .రాపిడ్ రెస్పాన్స్‌టీంలు ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా కోళ్లు తక్కువ రేటుకు వస్తున్నాయని తీసుకొస్తే వాటిని వెంటనే చెక్‌పోస్టు వద్ద నుంచి వెనక్కిపంపిస్తాం .

– కే.గుణశేఖర్ పిళ్లై, పశుసంవర్థకశాధికారి,అన్నమయ్య జిల్లా

కోళ్ల అసాధారణ మరణాలపై దృష్టి



జిల్లాలో కోళ్ల అసాధారణ మరణాలపై దృష్టి సారించాం . గుడ్ల ఉత్పతి తగ్గడంపై లెక్కలు సేకరిస్తున్నాం. రైతులు, ప్రజలకు పశువిజ్ఞానబడుల ద్వారా బర్డ్‌ఫ్లూ లక్షణాల గురించి తెలియచేస్తున్నాము. కోళ్లఫారాలలో క్రిమిసంహారక మందులను చల్లాలని యజమానులను ఆదేశించాం. బద్వేలు –నెల్లూరు మధ్య పీపీకుంట వద్ద కోళ్ల రవాణాను రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం.

– సీ.శారదమ్మ, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్థకశాఖ, వైఎస్సార్‌జిల్లా

వైఎస్సార్‌సీపీ కువైట్ కో-కన్వీనర్ నియామకం



ఎం.చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలం, నాగవరం, అలివేలు మంగాపురానికి చెందిన మన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డిని కువైట్ కో కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. 29 ఏళ్లుగా కువైట్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటున్న ఈయన వైఎస్సార్ కుటుంబానికి వీరాభిమాని. మొట్టమొదట వైఎస్సార్ కువైట్ కమిటీ ఏర్పడినప్పుడు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. ప్రస్తుతం కువైట్ కో కన్వీనర్‌గా ఎంపిక చేయబడ్డారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

గల్ఫ్ కోర్ కమిటీ సభ్యుడిగా ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి



ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కోర్ కమిటీ (జీసీసీ) సభ్యుడిగా రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలం, తిమ్మాయపాలెంకు చెందిన నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన కువైట్ కమిటీ సలహాదారులుగా పనిచేశారు. తనకు పదవి ఇవ్వడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరుగబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేస్తానన్నారు.

వైఎస్సార్‌జిల్లాలో నందలూరు మండలాన్ని కలపాలి

- ముఖ్యమంత్రికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి వినతి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి బొకే ఇస్తున్న మేడా సోదరులు మల్లికార్జునరెడ్డి, రఘునాథరెడ్డి

రాజంపేట: వైఎస్సార్ జిల్లాలోకి నందలూరు(రాజంపేటనియోజకవర్గం) మండలాన్ని విలీనం చేయాలని అన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథరెడ్డి స్పష్టంచేశారు. ఈమేరకు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవం అయిన సందర్భంగా కృతజ్ఞతగా కలిసి పూల బొకేను అందచేశామన్నారు. ఈ సందర్భంగా సీఎం దృష్టికి వైఎస్సార్ జిల్లాలో సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలు ఇప్పటికే ఉన్నాయన్నారు. నందలూరు మండలాన్ని కూడా కలపాలని విజ్ఞప్తిచేశామన్నారు. చెయ్యేరు నదికి ఈవలి(కడప)వైపు ఉన్న నందలూరును వైఎస్సార్ జిల్లాలోకి తీసుకోవడం వల్ల అన్ని విధాలుగా నందలూరు ప్రాంతీయులకు అనుకూలంగా ఉంటుందని వివరించామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. వీరితోపాటు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, ఏపీఐసీసీ స్టేట్ డైరక్టరు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, రాజంపేట జేసీసీ రూరల్ కన్వీను గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా ఘన విజయం సాధిద్దాం

- మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం
- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడానికి కృషి చేద్దామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మీఎస్ఆర్ కల్యాణమండపంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో 50 రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయని రాష్ట్రంలో అన్ని సర్వే సంస్థలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారం రాబోతోందని రిపోర్టు ఇచ్చాయని తెలిపారు. సీఎం జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. విభేదాలు పక్కన పెట్టి వచ్చే ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని కోరారు. కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

హ్యాట్రిక్ కొట్టబోతున్నాం

అందరి సహకారంతో పీలేరులో 2014లో 15 వేల ఓట్ల మెజార్టీ, 2019లో 7,800 మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని తెలిపారు. 2024లో హ్యాట్రిక్ కొట్టబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పీలేరులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం , 12 వేల ఇళ్లు మంజూరు, అన్ని మతాలకు వేర్వేరుగా శ్మశాన స్థలాలు కేటాయించామని తెలిపారు. అలాగే పార్కు, బైపాస్ రోడ్డు, పట్టణంలో రెండు ఆర్‌ఓబీ నిర్మాణాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. పీలేరు నుంచే తమ రాజకీయ ప్రస్థానం మొదలైందని, ఇక్కడి ప్రజల అందదండలతోనే తాము రాజకీయంగా రాణించామని వారు గుర్తుచేశారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా నాయకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి.రత్నశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటరామయ్య, సహదేవరెడ్డి, భాస్కర్‌నాయుడు, నాగరాజమ్మ, హబీబ్‌బాషా, హుమయూన్, మహితాఆనంద్, ఎస్.వి. చలపతి, హరిత, ఉదయ్, స్టాంపుల నరసింహారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న జెడ్పీ ఉద్యోగ సంఘ ఎన్నికలు

కడప సెవెన్‌రోడ్స్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ ఎన్నికలు ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 12 సమితుల యూనిట్లకు సంబంధించిన సభ్యులు, పరిషత్ యూనిట్ సభ్యులంతా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక వెలుగులు

నాడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో గుళ్లు, గోపురాలను కూల్చేశారు. అభివృద్ధి పేరుతో గుడిలోని లింగాలనే మింగేశారు. స్వామి ఆస్తులను అప్పనంగా దోచేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆలయాలకు సంబంధించిన విలువైన భూములు కాజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయాల అభివృద్ధికి కంకణం కట్టుకుంది. కొత్తవి నిర్మించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న వాటి జీర్ణోద్ధరణ పనులు పుంజుకున్నాయి. నాలుగేళ్ల పాలనలో ఆలయాలకు పూర్వ వైభవం వచ్చింది. ఆలయ అర్చకులకు దీప, దూప నైవేద్యం కింద గౌరవ వేతనం అందజేస్తున్నారు.

- ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారం
- మౌలిక సదుపాయాల కల్పన



మదనపల్లెలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం

సంవత్సరం	ఆలయాల సంఖ్య	కేటాయించిన నిధులు(రూ.లలో)
2019–20	4	52,800,000
2020–21	2	6,700,000
2021–22	7	57,350,000
2022–23	12	69,000,000
2023–24	12	41,200,000

మదనపల్లె సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలు అభివృద్ధి చెందాయి. కొత్తగా ఎన్నో ఆలయాలు నిర్మితమయ్యాయి. అలాగే పాత వాటిని అదనపు హంగులతో పునర్నిర్మించారు. జిల్లా దేవదాయశాఖ పరిధిలోని 1,652 ఆలయాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 37 ఆలయాలకు సీజీఎఫ్ నిధుల కింద రూ.22 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. ఇందులో 9 పనులు పూర్తి కాగా మిగిలిన 22 పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాలు

జిల్లాలో టీటీడీ, శ్రీవాణి ట్రస్టు ద్వారా 172 దేవతామూర్తుల ఆలయాలను నెలకొల్పారు. ఇందు కోసం రూ.1.72 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలయాలపై ఉన్న భక్తి భావాన్ని, చిత్తశుద్ధిని చాటుకుంది.

దూప, దీప నైవేద్య పథకం అమలు

జిల్లాలో 248 ఆలయాల్లో దూప, దీప నైవేద్యం పథకం అమలు చేస్తున్నారు. ఆలయ దీప, నైవేద్య ఖర్చుల కింద రూ.2 వేలు ఖర్చు చేస్తుండగా.. అర్చకుడికి రూ.3 వేలు కలుపుకుని ప్రభుత్వం రూ.5వేలు అందజేస్తుంది.

పూజారులకు వరం

ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు ఓపిక, శక్తి ఉన్నంతవరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్చక వయో అడ్డంకిని తొలగించారు. దీంతో అర్చక సమాఖ్య హర్షం వ్యక్తం చేస్తోంది.

టీడీపీ కుట్రలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ, అభివృద్ధిని చూసి ఎలాగైనా ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని టీడీపీ కుట్రలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేసి, రథాలను తగలబెట్టి మత కల్లోలం సృష్టించింది. విగ్రహాలు చోరీ, హుండీలు ఎత్తుకెళ్లడం లాంటి ఘటనలు జరిగాయి. వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. దీంతో టీడీపీ చేస్తున్న నీచ రాజకీయాలు, మతకల్లోలాలకు అడ్డుకట్టపడింది.

పకడ్బందీగా లెక్కలు

దేవదాయశాఖలోని ఆలయాలు, భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ఆలయ ఆస్తుల ఆక్రమణలపై గురి పెట్టింది. కమిటీ ద్వారా ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలో దూప, దీప నైవేద్యాలతో ఆలయాలు తులతూగుతున్నాయి. ఆలయ లెక్కలు, వ్యయం, జమలపై దృష్టి సారించింది. ఆడిట్ వ్యవస్థను పటిష్టం చేసింది.

అభివృద్ధికి ప్రాధాన్యత



జిల్లాలో కొత్తగా నిర్మించిన ఆలయాలతో పాటు పాతవి కూడా అభివృద్ధికి నోచుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ఫలితంగానే వీటికి పూర్వ వైభవం వచ్చింది. –విశ్వనాథ్, జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్

కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు ఎంపిక చేసిన స్థలం పరిశీలన



స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: రాయచోటిలో నూతనంగా నిర్మించబోతున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు ఎంపిక చేసిన స్థలం , క్రికెట్ స్టేడియాన్ని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ అధికారులతో కలిసి వాటిని సందర్శించారు. నూతనంగా నిర్మించబోయే కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు ఎన్నుకున్న స్థల వివరాలను ఆర్డీఓ రంగస్వామి, సంబంధిత సర్వేయర్లను, ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ వివరాలను మ్యాపుల ద్వారా ఆర్ అండ్ బీ ఎస్ఈ సహదేవరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను నిర్మించడానికి ఎంపిక చేసిన స్థలాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం దిగువ అబ్బవరంలో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియంను సందర్శించి అధికారులకు తగు సూచనలు చేశారు. పర్యటనలో ఆర్ అండ్ బీ ఎస్ఈ సహదేవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పసికందుపై పైశాచికం

వివాహేతర సంబంధం ఓ పసికందు ప్రాణం తీసింది. పైశాచికంగా ఒకడు పిడిగుద్దులు కురిపిస్తే అల్లాడిన మూడేళ్ల చిన్నారి తనువు చాలించాడు. నవ మాసాలు మోసి పెంచిన తల్లి మానవత్వం మరచి ప్రియుడిపై మోజుతో తప్పుడు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకొంది. నీటి తొట్టిలో పడి చనిపోయాడని ఫిర్యాదు చేయగా... విచారించిన పోలీసులకు అసలు విషయం తెలిసింది.

- పిడిగుద్దులకు మృతి చెందిన మూడేళ్ల చిన్నారి
- బాలుడి మృతి కేసు హత్యగా పోలీసుల నిర్ధారణ
- ప్రియుడిపై మోజుతో తప్పుడు ఫిర్యాదు చేసిన తల్లి





బాలుడిని కొట్టి చంపిన కేసులో తల్లి, ప్రియుడిని అరెస్ట్ చూపుతున్న తాలూకా సీఐ ఎస్.శేఖర్. (ఇన్‌సెట్) మృతిచెందిన బాలుడు హరన్ సాకేత్ (ఫైల్)

మదనపల్లె : నీటి తొట్టిలో పడి బాలుడు మృతి చెందిన కేసును పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. తాలూకా సీఐ ఎస్.శేఖర్ వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం చెరుకువారి పల్లెకు చెందిన చిచ్చిలి శివశంకర్ రెడ్డి(33) స్థానిక బ్రాందీ షాపులో పనిచేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన నాగరాజుతో స్నేహం ఏర్పడింది. తరచూ ఇంటికి వచ్చిన శివశంకర్‌రెడ్డి... కొద్ది రోజుల తర్వాత నాగరాజు భార్య మల్లకుంట్ల మయూరి(25)తో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. రెండేళ్ల తర్వాత తన ప్రియురాలు మయూరిని, ఆమె కుమారుడు హరన్‌సాకేత్(3)ను తీసుకుని గ్రామం వదలి ఉపాధి కోసం శివశంకర్‌రెడ్డి మదనపల్లెకు వచ్చారు. అక్కడే ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఇద్దరికీ ఉద్యోగాలు దొరకడంతో చిప్పిలిలో ఉంటూ పని చేసేవారు. వారు ఉద్యోగానికి వెళ్లేటప్పుడు మూడేళ్ల చిన్నారిని ఇంట్లో ఉంచి సెల్ ఫోన్ చేతికిచ్చి వెళ్లేవారు. సాయంత్రం వచ్చేటప్పటికి కుమారుడు మలమూత్రాలతో గలీజుగా ఉండడంతో ఇల్లును శుభ్రం చేసుకోవడం దినచర్యగా ఉండేది.

పిడి గుద్దులు కురిపించి....

ఈ ఏడాది ఫిబ్రవరి 13న శివశంకర్ రెడ్డి ఇంటి వద్ద ఉండగా, మయూరి ఉద్యోగానికి వెళ్లింది. చిన్నారి సాకేత్‌ను ఇంట్లో ఉంచారు. ఇంటి నుంచి బయటికి వెళ్లి శివశంకర్‌రెడ్డి రాగానే సాకేత్ మలమూత్రాలతో గలీజు చేయడంతో, పట్టరాని ఆగ్రహంతో ఊగిపోతూ కనికరం లేకుండా పైశాచయికంగా పిడిగుద్దులు గుద్దాడు. బాలుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతిచెందాడని చెప్పడంతో... తనను కాపాడాలని ప్రియురాలు మయూరిని వేడుకున్నాడు. దీంతో ప్రియుడిపై ఉన్న మోజుతో, తల్లి ప్రేమను మరిచి బాలుడు ప్రమాదవశాత్తు బకెట్‌లో పడి మృతిచెందినట్లు మయూరి తాలూకా పోలీసులో ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు అనుమానంతో తమదైన శైలిలో విచారించారు. దీంతో బాలుడిని ఆవేశంలో చంపినట్లు శివశంకర్‌రెడ్డి నేరం అంగీకరించడంతో హత్య కేసుగా మార్పుచేసినేట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుళ్లు రాఘవ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట : మండలంలోని వలసగుట్టపల్లెకు చెందిన పి.నరసింహులు (52) బైక్‌పై ఒక బాక్సు మద్యం తరలిస్తుండగా హంద్రీనీవా కాలువ వద్ద పట్టుకుని అరెస్ట్ చేసామని సీఐ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. బైక్, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 14మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అగ్రహారం పంచాయతీ పూలవాండ్లపల్లెలో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. దాడుల్లో 14 మందిని అరెస్ట్ చేయడంతో పాటుగా, రూ.22,890 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గడ్డివామి దగ్ధం



కొండ్రాజుపల్లెలో కాలిపోతున్న గడ్డివామి

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లెకు చెందిన రైతు కత్తెరగండ్ల మునిశేఖర్ వేసిన వరి గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పంటించారు. రూ.70 వేలు నష్టపోయానని రైతు తెలిపారు. వారం రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన నాగసుబ్బయ్య గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

మద్యం తరలింపుదారుల బైండోవర్

బి.కొత్తకోట : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై ముందస్తుగా బైండోవర్ చేసినట్లు సీఐ ఎస్.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. మండలంలోని సుబ్బిరెడ్డిగారిపల్లె, తుమ్మనంగుట్ట, మరవపల్లెకు చెందిన ఎ.శ్రీనివాసులు (40), కే.చంద్రశేఖర్ (37), కె.ఆస్తానప్ప (62), కె.గణపతి (48), టి.శేఖరప్ప (38), పి.రమణప్ప (48), ఎస్.మధుకర్‌రెడ్డి (39), బి.రామిరెడ్డి (35)లను తహసీల్దార్‌రు ఎదుట బైండోవర్ చేసి, రూ.లక్ష సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంకు పైకెక్కి హల్‌చల్

భార్య అవమానించిందని భర్త ఆత్మహత్యాయత్నం





ట్యాంక్‌పై నుంచి కిందికి దిగిన నవీన్‌ను తీసుకెళుతున్న పోలీసులు (ఇన్‌సెట్) ట్యాంక్ ఎక్కిన నవీన్

వేంపల్లె : స్థానిక నూర్జహాన్ హాల్ వీధిలో భార్య అవమానించిందని భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. నూర్జహాన్ హాల్ వీధికి చెందిన నవీన్ ఆలియాజ్ బబ్లూ స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య మణి, ఐదుగురు పిల్లలున్నారు. భార్యాభర్తలు ప్రతి రోజూ ఏదో కారణంతో గొడవపడేవారు. బుధవారం మధ్యాహ్నం భార్య అవమానించడంతో భర్త నవీన్ అది జీర్ణించుకోలేక అదే వీధిలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశారు. ప్రజలంతా గుమికూడి కేకలు వేసి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే స్థానికుడు నరసింహులు అనే వ్యక్తి అతన్ని చాకచక్యంగా కిందికి దింపి కాపాడాడు. నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుక



డిగ్రీ పట్టాలు అందజేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

- డిగ్రీ పట్టాలు అందుకుని మురిసిన ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు
- 26 మంది ప్రతిభా వంతులకు బంగారు పతకాలు



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(ఆర్ట్స్ కళాశాల)లో 2వ గ్రాడ్యుయేషన్ డే వేడుక బుధవారం వైభవంగా జరిగింది. ప్రత్యేక దుస్తులు (రోబ్స్) ధరించి విద్యార్థులు ఆకట్టుకున్నారు. అతిథులు యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ఏపీ కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ఆర్‌జేడీ డా.బాబులకు ఎన్‌సీసీ కేడెట్స్ ముందుగా గౌరవ వందనం సమర్పించారు.అనంతరం వేదికపై కళాశాల ప్రగతి నివేదికను ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ వివరించారు. ఈ సందర్భంగా వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగిన కళాశాల నుంచి డిగ్రీ పట్టాలు అందుకోవడం గర్వంగా భావించాలన్నారు. విద్యార్థులు బాహ్య ప్రపంచంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలన్నారు. కష్టపడి సాధించిన పట్టా మీకు, మీ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడినప్పుడే డిగ్రీకి విలువ ఉంటుందన్నారు. డాక్టర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల ముఖ్యమని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకుని నూతన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న 381 మంది విద్యార్థులకు అతిథులు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన 26 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. నాగలింగారెడ్డి, తులసి, కె. చిన్నపరెడ్డి, డా.ఎం.రమేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

పింఛన్ ప్రాణాలను కాపాడుతోంది



మాది చక్రాయపేట మండలంలోని ఓబుళనాయునిపల్లె. నాకు ఆరోగ్యం బాగా లేదు. కుమార్తె వివాహం చేసి నా భార్యతో కలిసి నివాసముంటున్నా.నాకు కిడ్నీ జబ్బు ఉంది. వాలంటీరు ప్రతినెలా తెల్లవారుజామునే పింఛను ఇంటికి తెచ్చి ఇస్తుంది. డబ్బు రాగానే కడపకు పోయి డాక్టరుకు చూపించుకుని మందులు తెచ్చుకుంటా. గత ప్రభుత్వం ఇచ్చే పింఛను ఏమూలకూ సరిపోయేది కాదు. పైగా పడిగాపులు కాయాలి. ఇపుడు సకాలంలో ఇస్తున్నందుకు సీఎం జగన్ సారుకు రుణపడి ఉంటాం.

– ఎద్దుల రమణయ్య, వృద్ధుడు, చక్రాయపేట

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి



రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందాయి. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే వాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మా గ్రామ సచివాలయం నుంచి మూడు రోజుల్లోనే మా ఇంటికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. మాకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా పథకాలు వస్తుండటంతో ఆర్థిక ఇబ్బంది లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం.

– హసీనాబీ, కొత్తకొట్టాలు, దువ్వూరు మండలం.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రఘునాథరెడ్డి(ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం తుమ్మలపల్లె గ్రామ సమీపంలో తోట దగ్గర రైతు రఘునాథరెడ్డి బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వ తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి, లతలు గత కొంతకాలంగా పులివెందులలో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం 11గంటలకు రఘునాథ రెడ్డి తుమ్మలపల్లె గ్రామ సమీపంలోని తోట వద్దకు వెళ్లారు. అనంతరం ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో భార్య, బంధువులు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో తోట వద్దకు వెళ్లి చూడగా అక్కడ విద్యుత్తు తీగల వద్ద విగతజీవిగా కనిపించారు. విద్యుత్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిన్నమండెం : మండల పరిధిలోని బెస్తపల్లె క్రాస్ వద్ద స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఓ కారు రాయచోటి నుండి మదనపల్లెకు వెళ్తోంది. నాయునివారిపల్లె నుండి చిన్నమండెంకు చెందిన వెంకటవరప్రసాద్ తన నాయనమ్మ కళావతిని విడిచి పెట్టేందుకు బైక్‌పై వెళ్తున్నారు. బెస్తపల్లె క్రాస్ వద్దకు రాగానే బైక్‌ను కారు ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాత్రికి రాత్రే కాలవ పూడ్చివేత

– కంచె వేసిన టీడీపీ నాయకులు



కాలువను పూడ్చి హద్దు ఏర్పాటు చేసిన దృశ్యం

ఓబులవారిపల్లె : రాత్రికి రాత్రే జేసీబీ సహాయంతో కాలవను పూడ్చి తన కంచె ఏర్పాటు చేసిన ఘటన బుధవారం జరిగింది. బొమ్మవరం కమ్మపల్లె గ్రామం ప్రధాన రహదారి ప్రక్కన కాలవ ఉంది. శేషక్కగారిపల్లె గుట్ట అటవీ ప్రాంతం నుంచి ఈ కాల్వ ద్వారా వర్షపు నీరు చెరువులోకి చేరుతుంది. అయితే కమ్మపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నేత జగన్‌మోహన్ నాయుడు జేసీబీతో కాలవ పూడ్చేందుకు సోమవారం పనులు చేస్తుండడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు చేరుకుని పనులను నిలిపివేశారు. అయితే రాత్రికి రాత్రే కాలవ పూడ్చి తన పొలంలో హద్దు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నీరు తోటలకు చేరి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమణలు తొలగించాలని తహసీల్దారుకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. తహసీల్దారు శేషగిరిరావు వివరణ కోరగా కాలవ అక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు.


టేకు రథం అందజేత



ఆలయ అధికారులకు రథం రికార్డులను అందజేస్తున్న కన్నడ భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి కర్ణాటక భక్తులు బుధవారం పూర్తి స్థాయి రికార్డులతో టేకు రథాన్ని అప్పగించారు. 2011లో రూ.8.3 లక్షలతో రథాన్ని నిర్మించారు. అప్పటినుంచి ఉత్సవాల సమయంలో ఊరేగింపునకు ఉపయోగించే వారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆ రథాన్ని ఆలయ అధికారులకు అప్పగించినట్లు ఆలయ ఈవో రమణారెడ్డి తెలిపారు.

అగ్గి రాజుకుని అడవి బుగ్గి



మంటలతో కాలిపోయి బోసిపోతున్న గట్టుకొండ



గుర్రపుగుట్టలో మంటలు ఆర్పుతున్న సిబ్బంది

పూర్తిగా కాలిపోయిన కొండ, గుట్టలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని గట్టు కొండ, చలిమామిడి మార్గంలోని పచ్చని అడవిలో అగ్గి రాజుకోవడంతో కాలి బుగ్గి అయింది. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో కిలోమీటరు మేర మొక్కలు కాలి బూడిదయ్యాయి. మంగళవారం సాయంత్రం మొదలైన మంటలు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలోని డేగానిపల్లె సమీపంలోని అటవీ సరిహద్దు వరకు వ్యాపించాయి. రోడ్డుకు ఇరువైపులా ఎండు గడ్డి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందుతూ పట్టని చెట్లు, మొక్కలు, వివిధ రకాల పండ్ల చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్రపుగుట్ట అడవిలో 23 ఏళ్ల క్రితం నాటిన ఎర్ర చందనం మొక్కలు కాలిపోయాయి. వేడిమి తాళలేక వన్యప్రాణులైన కుందేళ్లు, జింకలు, దుప్పులు, నెమళ్లు అధికసంఖ్యలో కర్ణాటక సరిహద్దులోని అటవీప్రాంతం వైపునకు వెళ్లిపోయాయి.

కొండలకు నిప్పు

అడవికి పక్కనే ఉన్న గట్టు కొండకు నిప్పు పెట్టిన ఫలితంగా ఇది జరిగినట్లు స్థానికులు తెలిపారు. సూరవువారిపల్లె గ్రామం వైపు నుంచి బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలోని కొండకిందపల్లె వరకు ఉన్న కొండపై పచ్చదనం కాలిపోయింది. వృక్షాలు, మొక్కలు, గడ్డి కాలిపోగా వన్యప్రాణులు పల్లెల వైపునకు పరుగు తీశాయి. మంగళవారం రాత్రి నుంచి మంటలను అదుపు చేసేందుకు హార్సిలీహిల్స్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, సిబ్బంది, ప్రయత్నించగా బుధవారం ఉదయం అదుపులోకి వచ్చాయి. వందల హెక్టార్ల అడవి కాలిపోయింది.

ఆంధ్ర–రైల్వేస్ మ్యాచ్ డ్రా



అన్ష్‌యాదవ్ (268 పరుగులు)



అంచిత్ యాదవ్ (133 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో రైల్వేస్, ఆంధ్ర జట్ల మధ్య జరుగుతున్న అండర్–23 క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజున బుధవారం 638 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రైల్వేస్ జట్టు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 865 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని అన్ష్‌యాదవ్ 597 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సర్లతో 268 పరుగులు చేయగా, అంచిత్ యాదవ్ 219 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 133 పరుగులు చేశాడు. ఈయనకు జతగా తౌఫికుద్దీన్ 87 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు టి. వంశీకృష్ణ 2 వికెట్లు, టి. విజయ్ 2 వికెట్లు, వై. వాసు 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 378 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రైల్వేస్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ప్రతి రూపాయికి ఆధారాలున్నాయి

గోపవరం : మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ బ్యాంకు ఖాతా నుంచి డ్రా చేసిన రూ.18 లక్షలలో ప్రతి రూపాయికి ఆధారాలు న్నాయని బద్వేల్ దేవాదాయశాఖ ఈఓ సి.శివయ్య పేర్కొన్నారు. 'ఆ రూ.18 లక్షలు ఏమయ్యాయి?' శీర్షికతో సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. 11–11–2022 నుండి 17–11–2023 వరకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ ఖాతా నుంచి రూ.18 లక్షలు డ్రా చేయడం జరిగిందన్నారు. సిబ్బంది జీతాలు, డిపార్ట్‌మెంట్‌కు చెల్లించిన కాంట్రిబ్యూషన్, వారాల పూజలు, బ్రహ్మోత్సవాలకు కర్నూలు ఉప కమిషనర్ ఆదేశాలతో డబ్బు ఖర్చు చేసినట్లు తెలిపారు. తలనీలాల సేకరణకు రెండు దఫాలుగా వేలంపాట నిర్వహించామని, ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు.

బారికేడ్‌ను ఢీ కొన్న మినీ లారీ

నందలూరు(రాజంపేట) : కడప – చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద ఎర్రగడ్డ లోడుతో వెళ్తున్న మినీ లారీ రాంగ్ రూట్‌లో వెళ్లి బారికేడ్‌ను గుద్దిన సంఘటనలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. తాడిపత్రి నుంచి ఎర్రగడ్డ లోడుతో చెన్నై వెళ్తున్న ఏపీ39వీబీ1366 నెంబర్ గల మినీ లారీ నందలూరు చెక్‌పోస్టు వద్ద ఆగకుండా వెళ్లేందుకు ప్రయత్నించే సమయంలో బారికేడ్‌ను లారీ ఢీ కొనడంతో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో వాహనాలు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న మార్కెట్ యార్డు అసిస్టెంట్ నాగరాజు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ రాముడు, పోలీసు దర్బార్ బాషాలు సంఘటనా స్థలానికి చేరుకొని బారికేడ్‌ను లారీ నుంచి తొలగించారు. వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

– రాయలసీమ రీజనల్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్ కుమార్



హోంగార్డ్స్‌కు సూచనలు ఇస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

రాజంపేట : హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించి జిల్లా పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. స్థానిక మన్నూరు జెడ్పీ హైస్కూల్ క్యాంపస్‌లో బుధవారం రాజంపేట డివిజన్ పరిధిలో హోంగార్డ్స్‌కు విజిటింగ్, పరేడ్ ఇన్‌స్పెక్షన్, వెల్ఫేర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌గార్డుల దయనందిన విధులు, సవాళ్లతో కూడుకుందని, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. అలాగే మెళకువలు తెలుసుకోవాలన్నారు. డ్రిల్, కవాత్తు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు ఎలా నిర్వహించాలో దిశా నిర్దేశం చేశారు. రాబోవు ఎన్నికలలో విధి నిర్వహణకు సంబంధించిన అంశాలను ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జివి చలపతి, సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జ్, హోంగార్డులు పాల్గొన్నారు.